# పోలాం పిల్లలు

ఎఱ్రాయి, ఎంకటాములు అమ్మ పోలాం, అయ్య పుల్లాయిలు సీతారావుమ్మ గోరింటిపక్క రంగయ్యగారి తోట కనిపెట్టుకునుంటారు; కాని తోటమీన కాత్తె కూత్తె గిట్టుంటే అయ్య పక్కింటి సీతారావుమ్మగోరింటో పాసిపనికి కుదిర్న అమ్మను కాణీకి అర్ధణాకంటూ పానాలు పీక్కదిన్నడు.

ఆ దినం తెల్లారి లెగిసింది మొదలు అయ్య అదొాక పద్ధతి గుండాడు. ఆవజాన ముసుగేసుకుని గుడిసెగోడ కానుకు కూసుని అమ్మకల్లీ, తమకల్లీ మద్దె మద్దె కోరసూపులు సూత్తుంటం ఎఱ్రాయి, ఎంకటాములకు వొళ్లంతా దురద గుంటాకు రుద్దినట్టుగుండది.

"ఎఱ్రాయ్?"

"ఏందే ఎంకటాం?" - సాటుసాటున గుసగుస లాడుకుండారు ఎఱ్రాయి, ఎంకటాములు.

"ఏందిరా, అయ్య అట్ట కూకుండాడు కదలకుండా?" అంది ఎంకటాం.

"అదేమో, యిగ్రహానికమల్లే అటనే కూకుండాడు - పుగాకు లేదుగావాఁల్ను" అన్నాడు ఎఱ్రాయి.

'పుగాకూ! ఎదవపుగాకు ఏంయ్యా లేకబోతే?" అంది ఎంకటాం.

"అదేటమ్మా-కుతిగా వుండ దెట్టా?" అన్నాడు ఎఱ్రాయి.

"కుతిగా వుంటే? డబ్బులు యాణ్ణుంచొస్తాయిరా పద్దాకా! ఒరేయ్. నువు పొగాకు తాగావంటే అయ్యతో సెబతా" అంది ఎంకటాం.

"శా-నేనా ఎదవ పుగాకు! ఓసారి అయ్యే అడిగితే లేదన్నాగా!" అన్నాడు ఎఱ్రాయి.

"ఏందిరా అడిగిందీ?"

"పుగాకు"

"ఎవుర్నీ!"

"నన్నే"

"నిన్నూ!"

"ఓ పాయుంతే యిటు బారేయరా - అనడిగాడే"

"ఏందీ!"

"ఆమయిన సంపుతాడేమోనని లేదన్నా?"

"నువు తాగుతావంట్రా."

"సీ, ఎదవదీ! ఓపాలి ఎట్టుంటదోనని సూశాలే-సన్నాసిది!"

"ఒరేయ్ - అమ్మతో సెప్పనా?"

"నే తాగుతేగా - అట్ట సూసి అట్టనే పారేత్తినిగా"

"అమ్మ సంపుద్దిరోయ్-"

"మరి అయ్య కిచ్చుద్దే కాణీలు - కొనుక్కోమనీ?" అన్నాడు ఎఱ్రాయి.

"యీ అయ్య కేం పన్లేదు; పద్దాకా అమ్మను సంపుతావుంటాడు" అంది ఎంకటాం.

"ఏమేయ్?" అనరిసి బిలిశాడు అమ్మను అయ్య.

"నిన్నే నేయ్?" అని మల్లీ అరిశాడు అయ్య.

అమ్మ యిసుక్కుందది.

"నిన్ను గదంటే?" యింకాత్తె గెట్టిగా అరిశాడు అయ్య.

"ఎందుకు అట్టరుసుకుంటావ్?" అంది అమ్మ.

"అయితే నువు ఎల్తానంటావా ఎల్లనంటావా?" అన్నాడు అయ్య.

అప్పటికి కాత్తె ఎండెక్కింది. అయ్య ఎవారం కాత్తె కాకమీనుంటంజూసి సల్లగా ఎఱ్రాయి సెయి గీరింది ఎంకటాం. యింకూసేపిట్లో గుడిసెకెనకమాల నారింజ సెట్టుకింద యిటక కుప్పసాటుకు సేరి సప్పిడి కాకుండా కూసుండారు ఎఱ్రాయి, ఎంకటాములు.

అరవమాక మంది ఎంకటాం ఎఱ్రాయితో.

అరవనన్నాడు ఎఱ్రాయి ఎంకటాంతో.

గుడిశెలో తుబుక్కున వుమ్మ్యాశాడు అయ్య.

"అయితే నువు చీతారావుమ్మగోరింటికి పనికెందుకెల్లవే?" అన్నాడు అయ్య.

"నువు లచ్చజెప్పు నే నెల్లను" అంది అమ్మ.

"అది గందుకనే జెప్పేది. ఎందుకెల్లావూ అంట?" అన్నాడు అయ్య.

"ఆరి సబ్బిల్లలన్నీ నేనే పూసుకుండానంట" అంది అమ్మ.

ఎంకటాం ఎర్రాయికల్లి సూత్తే ఎర్రాయి ఎంకటాంకల్లి సూశాడు.

"సబ్బిల్లలూ! సబ్బిల్లలేందే" అన్నాడు అయ్య.

"సబ్బిల్ల లేందంటాడేం? ఆరు రుద్దుకునే సబ్బిల్లలన్నీ నేనే రుద్దుకుంటున్నానంట."

"అని ఎవురన్నారూ?" అన్నాడు అయ్య.

"యింకెవు రంటారూ– ఆ చీతారావుమ్మగోరే"

"మరెందుకు రుద్దుకున్నా?" అన్నాడు అయ్య.

"యిదేందయ్యోవ్, నువు ఆయిణ్ణి ఎనకేసుకొస్తున్నట్టుండే సూత్తే– యిగసాల్లే వూరుకో యియాల్టికి."

"చరే, అట్టనే వూరుకుంటా– అయితే చీతారావుమ్మగోరు నిజంగా అన్నదంటా?" అన్నాడు అయ్య.

"అన్నదంటా! ఓ అంటవేందీ– మీన మీన కొచ్చిందిగా!"

మల్లీ తుబుక్కున వుమ్మూశాడు అయ్య.

"అయితే యిప్పు దేందే నువనేదీ?" అన్నాడు అయ్య కూసేపుండి.

"నే నెల్ల నాడికి" – యిసిరేసినట్టంది అమ్మ.

"తొందరపడ్డావులే" అన్నాడు అయ్య.

"ఎవురు నేనా?"

"ఆఁ నువేనే. కాకబోతే పతినెలా రెండు రూపాయలు సేదంటే నీకూ?" అన్నాడు అయ్య.

"యాడుంటదీ– యాడన్నా పుగాకు సేదుగా వుంటదెట్టా?" అంది అమ్మ.

"అదిగందుకే తిక్క రేగుద్ది – నువుగాంఀగా మా లావు సంపాయించావులే ముండమోపి డబ్బులు" అన్నాడు అయ్య పెటీమని కొట్టినట్టు.

ఎర్రాయి ఎంకటాంకల్లి సూశాడు. ఎర్రాయి రెక్కగూణ్ణు ఒక్కగుంజు గుంజింది ఎంకటాం.

"అంత రోసం గలోడివయితే ఎల్లి సంపాయించుకు రారాదూ?" అంది అమ్మ.

"అయితే నే నీడ ఎదవనై కూకుండానంటావు?"

"నే నన్లేదయ్యోవ్ అంత లావుమాట! నీకేం మారాజుకుమల్లేనే కూకుండావు" అంది అమ్మ.

"అఁ కూకుండాలేవే. తోటమీన కాత్తె కల్చొత్తే నువామాట లంటా? మరా రంగయ్యగోరు ఆవజాన నడుపుతుండాడు యవారం."

"మరి ను వావజాన నీలునవుఁల్తా కూకుంటే యవారం నడపడెట్టా?" అంది అమ్మ.

"తోట కాత్తె ఎదిగి లాబాన పడ్తే ఏమన్నా యిత్తానంటుంటే యిగా మడిసితో ఏంజేత్తా?"

"యింకా ఒకటే ఎదగాల్చిందే యివకడ డొక్క పీక్కబోతావుంటే. యవారం యిట్టనంటయా, వుండాల్సిందీ?" అంది అమ్మ.

"ఆ ఎవారమేందో నే దేల్చుకుంటాగానీ యిప్పుడు నీ యవారమేందో ముంగల దేల్చు" అన్నాడు అయ్య.

"నా యవారం నీ యవార మేందంటా?"

"ఏందేందే! గొప్పోర్తో నువూ నేనంటే తిరగబడాల్చిందీ? అసలట్టయితే ఎట్టానంటా?" అన్నాడు అయ్య.

"నీ తత్వాలేందో తెలపటం లేదు గాని, అసలామడ్చి మాటిమాటి కావజాన సేతులు తిప్పుద్ది, దేనికంటా?"

"సేతులు తిప్పట మేందే"

"మరదేందో సబ్బులంటా సేతులు తిప్పుద్దీ!"

"ఎవురూ?" అన్నాడు అయ్య.

"ఆ చీతారావుమ్మగోరే!" అంది అమ్మ.

"అదిగదే వొద్దన్నా" అన్నాడు అయ్య.

"ఏంది వొద్దన్నా" అంది అమ్మ.

"యిట్టాటియన్నీ తోసేసుకు తిరగాల్చిందే" అన్నాడు అయ్య.

"ఎల్లి నువు నిలబడు ఆయిడ ముంగల"

"ఆ, నిలబడాల్చిందే"

"నువు లచ్చ జెప్పు"

"సెప్పి నట్టేను"

"మరి సబ్బిల్ల లంటంటే-"

'ఏహె అంటే అందిలే"

"ఆమాట ఎందుగ్గాను రావాల్సొచ్చిందంటా?"

"రాగాలు తీయమాక"

"నువు తియటంలా-"

"నేనా-పొళ్ళూడ్తయి-"

ఆవజాన కళాపి గొట్టినట్టె ఎడాపెడా అయ్యా, అమ్మల మద్దె దుమ్ము లెగిసేతలికి బెడిసి లెగిసి రాత్తా పక్క సింతసెట్టుకిందికొచ్చి కూకున్న ఎర్రాయి, ఎంకటాములకు సీతారావుమ్మగోరియింటి ముంగలకు ఓ మనగాడి తెల్లగుర్రాం బండి ఎగురుకుంటా వచ్చి నిలబట్టం అగుపిచ్చింది.

"ఆర్నీ - రాంకిట్టయ్యగోరు-!" అన్నాడు ఎర్రాయి లెగుస్తా.

"ఏ రాంకిట్టయ్యగోర్రా?" అనడిగింది ఎంకటాం తనూ ఎర్రాయితో లెగుస్తా.

"ఏహె, చీతారావుమ్మగోరి అల్లుళ్ళే. తసదియ్యా - చుందరమ్మ పంట పండింది!"

"ఎందుకురా పంట పండిందీ-!" అనంటుండా యినిపిచ్చుకోకుండా ఎంకటాం రెక్క బట్టుకుని గబగబ బండికాడికి లాగాడు ఎర్రాయి!

రాంకిట్టయ్యకల్లీ, రాంకిట్టయ్య ఎక్కొచ్చిన బండీ, బండిసాయిలు ఎర్రగళ్ళ లుంగీ, నల్లగడ్డాంకల్లీ కిందినించి పైదాకా ఆవజాన ఓసూపు జూసి, ఎంకటాం సెయిబట్టుకు తెల్లగుర్రం సూట్టూతా ఎర్రాయి ఓ సెక్రం తిరిగేతలికి సొరగలోకాన్నించి ఎగ్గిర్దాకి నట్టొచ్చి సెంబునీలతో కాలకడా లాడిస్తా వాకిట్లోకొచ్చి నిలబడ్డది సీతారావుమ్మగోరు.

సాయిబును టంకుపెట్టె లోనకు పట్టుకురామంటా బూడుసులు టక్‌టక్ కొట్టుకుంటా కడ్డీకి మల్లే సీతారావుమ్మ గోరింటోకి నడిశాడు రాంకిట్టయ్య.

"పాపం - మా యింటోనే భోంచేసి వెళ్లేం?" అని పెద్దగా అంటున్నది సీతారావుమ్మగోరు సంబరంగా.

"సూశావంటే." అన్నట్టు సూశాడు ఎర్రాయి ఎంకటాంకల్లి. ఎంకటాం సీతారావుమ్మగోరికల్లి సూసింది. సీతారావుమ్మగోరు గబిక్కిన సూసింది ఎర్రాయి, ఎంకటాముల కల్లి - బూమి పగిలి ఆడేందో లెగిసినట్టు.

"ఆ ముండేదీ - నాయన్నాయన! కాస్త ఒక్కసారి యిట్లా ఒచ్చిపొండి, ఏమన్నా యింత తునక చేతిలో పెద్తా-దేవుడు పంపిన ట్టొచ్చారు నాయన - అరవకుండా దొడ్డోకి రండేం-" అంటా లోనకి నడిసింది సీతారావుమ్మగోరు నవుతా.

ఇంకూసేపటికి సీతారావుమ్మగోరి దొడ్డో కరేపసెట్టుకింద అంటగిన్నెల మయాన - గొబ్బెమ్మలకి మల్లే - కూకుండారు ఎఱ్రాయి, ఎంకటాము.

టకటకటక మట్టెల కొట్టుకుంటా పావురాయికి మల్లె ఎగురుకుంటా మద్దె గెదిలోంచి దొడ్డోకొచ్చి ఒక్కపాలి పక్కన సెయిబెట్టుకు పగలబడి నవ్వి ఒంటింటోకి లగెత్తికెల్లింది సుందరమ్మ.

"యిహి-" అంటా మనికట్టుతో ముక్కు ఎగదోసుకుండాడు ఎఱ్రాయి.

"ఎందుకురా అట్టా ఎగబీల్సుకుంటా నవుతావ్?" అంది సుందరమ్మ దూకుడుకు దిమ్మరబోయిన ఎంకటాం.

"తసదియ్య, బలేదిగదంటే చుందరమ్మా-"

"గెట్టిగా అరవమాకరా సచ్చినోడా-"

"ఆ సాయిబు వెళ్ళాట్టే - పాపం ఆయనకి ఏం కావాలో కాస్త చూస్తుండరాదుటే - వెళ్ళవే చచ్చిందానా-" అని కాత్తె పెద్దగా, కాత్తె సిన్నగా అంటున్నది ఒంటింటో సీతారావుమ్మగోరు.

"గారెలు జేత్తుండదేవ్-" అన్నాడు ఎఱ్రాయివాసన పీలుస్తా.

"యాడా? పొప్పు రుబ్బలేదే-" అంది ఎంకటాం.

"మరేందబ్బా సుఁయ్ మనిపిత్తుండదీ - పొకోడీలెట్టా? నాలుగున్నా పెట్టుద్దో లేదో-"

"ఒరేయ్, అంతాశ వుండగూడదురా!"

"పానీ, రెండన్నా పెట్టదంటా?"

"తోమారుట్రా అంట్లూ- కాసిని నీళ్ళు తోడి పెట్టరూ ఆతొట్లలోకీ, బిందెల్లోకీ, కడవ బావిలో బడేసి చచ్చేరు - నాయన్నాయన! కాస్త ఈ నాలుగు బిందెలూ కడవాకూడా తోమిపెట్టరూ అల్లరిచేయకుండా!" అంటూ సెక్రందిరిగినట్టు ఒచ్చి ఎల్లిపోయింది సీతారావుమ్మగోరు.

"ఏందిరా సూత్తుండావూ - ఒరేయ్ - ఒరేయ్-" అంది ఎంకటాం మద్దెగది అవతలగదేపు మెడజాపి సూత్తుండ ఎఱ్రాయ్‌కల్లి ఇంతగా చూస్తూ.

"ఎహ అరవమాకే–"

"ఏందిరా–ఏందిరా–" కాత్తె ఎర్రాయికాడికి జరిగి తనూ అట్ట మెడ జాపిందో లేదో ఎంకటాం ఎన్నెముక మీన ముల్లుగర్రతో పొడిసినట్టు టపీమంటా ఎంకటామును తోసుకుంటా యిరుసుకు ఇవకాడ పడ్డాడు ఎర్రాయ్.

"అమ్మ! సత్తిన్నోరెర్రాయ్–" అంది ఎంకటాం వుక్కిరిబిక్కిరవుతా.

"అరవమాకే తల్లా–" లెగిసి ఎంకటామును గెట్టిగా వాటేసుకుండాడు ఎర్రాయి.

"ఎహె, అరవన్లే యిడూ – ఏందిరా నువు గెదికాడ సూత్తుండదీ?"

"ఆళ్ళే – ఆళ్లు–"

"ఎవుర్రా!"

"రాంకిట్టయ్యా చుందరమ్మా–"

"ఆఁ!..."

"సెయి లటిక్కిన పట్టుకుండాడు!"

"ఎవుర్దీ–!"

"చుందరమ్మదే...!"

"ఓయ్యో–"

"అదేమయిన గుంజుకుంటుండది చుందరమ్మ–!"

"అమ్మబుల్లో–!"

"ఒరేయ్ పిల్లలూ, నీళ్ళు తోడారుర్రా – అయ్యో అయ్యో నే నేంజేతునూ పక్షిమొహాలూ మీరూ – మా నాయనగదూ, మా అమ్మగదూ, దబ్బున తోడి పెట్టరూ?" అట్టా తలుపుకాడి కొచ్చి జూసి పిండి మరన పడ్డట్టయి – అటనే లోనకి గిరుక్కున మల్లింది సీతారావుమ్మగోరు పోకోడీలకాడికి.

మిట్టమద్దానం పొద్దు నిటారుగా నిలబడే యాలకు గుప్పిట్టు మూసుకుని గబగబ లగెత్తుకుంటా సీతారావుమ్మగారింటోంచి ఒచ్చి తోటపెండెంగోడ మొత్తకాడ నిలబడ్డారు ఎర్రాయి, ఎంకటాములు.

"నీకు ఎన్ని పాకోడీలు పెట్టిందే ఎంకటాం.

"రెండూ – నీకురా?"

"నాకు మూడూ - ఏవే నీవి సూపించూ - సూశామ్మా, నాకు సిన్నవి బెట్టిందీ - నీకు కాణి ఇచ్చిందంటే?"

"ఇయలేదురా - నీ కిచ్చిందంట్రా?"

"అవ్ నా కిచ్చిందిగా!"

"పానీలేరా - ఒరేయ్, కాణీతో పుగాకు కొనుక్కుంటావంట్రా?"

"కాణీ నాదమ్మోవ్-"

సప్పున పెండెంగోడ కవకాణ్ణుంచి అమ్మ తలకాయ బెయిటికొచ్చి గబిక్కిన ఎఱ్ఱాయి, ఎంకటాములను తోట్లో గుడిసెలోనకి మళ్లేసుకెల్లింది.

"ఏందిరా మీకు చీతారావుమ్మగోరిచ్చిందీ, సూపియ్యండీ - పాకోడీ లంట్రా-" అంటా ఎఱ్ఱాయి ఎంకటాల గుప్పిట్లు పరీచ్చజేస్తుందది అమ్మ.

"ఈడికాడ కాణీ వుండది - ఇటు బారెయరా, కాణీ-" అంటుండాడు అయ్య.

"కాణీ! ఏదీ కాణీ" అంటుండది అమ్మ.

"ఆడికి చీతారావుమ్మగోరు కాణి ఇచ్చింది - జాంసెట్టెక్కి నే జూశా" అంటుండాడు అయ్య.

"జాంచెట్టెక్కావూ! ఎందు కెక్కా - వుండాడ - ఏదిరా కాణీ!" అంటుండది అమ్మ.

"యిటు బారెయి-" అంటుండాడు అయ్య జరుగుతా.

"యియమాకరా-"

ఎఱ్ఱాయి బొడ్లో కాణీబిల్ల టాప్పున బూమ్మీనపడి దొల్కుంటా దొల్కుంటా గుడిసెమూల సీకట్లో ఎల్తుండది. ఎంకటాం ఎఱ్ఱాయి సెయి బర బర బరికిందో లేదో - పాకోడీ పిడికిట్లె బిగుచ్చుకుంటా వుండేల్బద్దగుండొదిల్నట్టు బఁయిన తోటమూల మల్లెపొదల పాటుకెళ్ళి మాయమయ్యారు ఎఱ్ఱాయి, ఎంకటాములు.

**('ఆంధ్రపత్రిక' వికృతి ఉగాది సంచిక)**